*Sri Ramana Jyothi wishes its readers a Very Happy New Year, 2019*

***Special Issue on Dr. K. Subrahmanian,** Founder President of Sri Ramana Kendram, Hyderabad.*


| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| జనవరి 2019 | January 2019 |


ఈ సంచికలో ...    IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కె.యస్. గారి 55వ ప్రవచనం** | తాడిమేటి సత్యనారాయణ | 3 |
| 2. | **రమణ స్వరూపులు, పూజ్యులు శ్రీ కె.ఎస్.గారు** | దోనెపూడి వెంకయ్య | 11 |
| 3. | **ధన్యజీవి డా॥ కె.ఎస్. గారు** | అ.వెం. రమణయ్య | 13 |
| 4. | **డా॥ కె.ఎస్. గారి విశిష్టత** | శ్రీమతి పెమ్మరాజు రాధమ్మ సుబ్బారావు | 18 |
| 5. | **మహామనీషి** | డా. వి. రామదాస్ మూర్తి | 23 |
| 6. | **శ్రీ సుబ్రహ్మణ్యులకు స్మృత్యాంజలి** | శ్రీమతి త్రిపుర సుందరి | 27 |
| 7. | **గేయ మాలిక** | శ్రీమతి త్రిపుర సుందరి | 30 |
| 8. | **The Power of Silence** | Dr.K.Subrahmanian | 32 |
| 9. | **Dr. K.S. - Some Treasured Memories** | G.Srihari Rao | 35 |
| 10. | **Appa's Love for Children** | Manaswini Sridhar | 41 |
| 11. | **My Memories of Arthimber** | Janani | 43 |
| 12. | **SRKH - The Gift of Grace** | Sneha Chowdhury | 46 |
| 13. | **Sadguru - Dr. K.S.** | Dr. A.V. Narasimha Rao | 50 |
| 14. | **The Real Auspicious Life Is The Death of Ego** | N.S. Ramamohan | 53 |


## Events in Sri Ramana Kendram in January

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 11th January: Dr. K.S. Remembrance Day - 6.00 - 7.30 p.m.
4. 15th January - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.

**హైదరాబాదులో శ్రీ రమణకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణజ్యోతి పత్రిక వ్యవస్థాపకులు అయిన కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్ (డా॥ కె.ఎస్.) గారి ఆరాధన (జనవరి 11) సందర్భంగా ఈ జనవరి, 2019 శ్రీరమనజ్యోతి డా॥ కె.ఎస్. గారి ప్రత్యేక సంచికగా వెలువడుతోంది.**



**కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్ గారు**

(28 ఏప్రిల్ 1928 - 11 జనవరి 1998)

# ఆత్మనిష్ఠుడవై ఉండు

ఆంగ్ల మూలం: డా॥ కె.యస్. గారి 55వ ప్రవచనం

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

మనం క్షణం తీరిక లేకుండా ఏదో ఒక పని చేస్తూనే ఉంటాము. కాని సంతృప్తి వుండదు. ఎప్పుడు వీటి నుండి ముక్తి కలుగుతుందోయని ఎదురుచూస్తూంటాము. నాకెందుకు ఈ కష్టాలన్నీ అని అనుకొనే రోజులు కూడా ఉంటాయి. ఇది ప్రతి ఒక్కరి సమస్య. ఎవ్వరికీ దీని నుండి మినహాయింపు లేదు. మరొక విచిత్రమేమంటే ఆనందంగా ఉన్నప్పుడు, చక్కటి ఆహ్లాద కరమైన పరిస్థితులను అనుభవిస్తూంటే, హఠాత్తుగా ఈ ఆనందం,

సంతోషం నాకు ఇట్లాగే కొనసాగుతుందా? అనే ఆలోచన వస్తుంది. ఈ సంతోషకరమైన సమయం మళ్లీ రాదేమోననే భయం ఆందోళన కలుగుతాయి. నిత్యమూ సంతోషము కావాలి మనకు.

ఆనందం లేకపోతే దానికై వెదుకుతూంటాము. దుఃఖం కావాలని మాత్రం ఆశపడము. చింతలలో వుండేవారే ఆనందాన్ని కోరతారు. కారణం ఆనందమే మన సహజ స్వభావము, దుఃఖం ఒక భ్రమ అంటారు భగవాన్. ఆనందానికి ఎన్నో కారణాలు. సంపద కావాలని కొందరు, పేరు ప్రతిష్ఠలంటారు, సంతానం కావాలనే వారు కొందరు, సంసారం కావాలనుకొనే వారు మరికొందరు, ఒక్కొక్కరు తలకొక విధంగా ఆనందానికై ప్రాకులాడుతారు. మనకు తెలుసు బాహ్య ప్రపంచం నుండి లభించే ఆనందం అనిత్యమని. బాహ్య పరిస్థితి మారితే ఆనందం పోయి దుఃఖం కలుగుతుంది. కనుక భగవాన్ బోధించేది ఏమంటే, ఆనందాన్ని నీలోనే వెదకి పొందాలని. కాని మనస్సు ఎటువంటిది? మనలను లోనికి వెళ్లనివ్వదు.

మనస్సు ఒక అసాధారణమయిన సూక్ష్మవస్తువు. ఉన్నటువంటి పరిస్థితులలో సూక్ష్మ తత్త్వాన్ని తెలుసుకొనడం కష్టం. మనస్సు మనలను అనేక విధాలుగా మోసం చేస్తుంది. పరిస్థితులు బాగోలేకపోతే, రేపటి నుండి పూజ, ధ్యానాదులు చేస్తాను అని అంటే భావమేమిటో తెలుసునా? బాగోలేని పరిస్థితుల నుండి మనస్సును పూజ, ధ్యానం, పుస్తక పఠనం, సంగీతమో, సినిమానో వీటిపై మళ్లించడమనే అర్థం. కాని జరిగేది ఏమిటి? పూజ చేయడం ప్రారంభించిన తర్వాత, ఈ పూజ చాలదు,



చాలా విస్తృతంగా చేయాలి. పదిమంది దానిలో పాల్గొంటారు. అందరూ పూజ చేయడానికి మరెన్నో సలహాలిస్తారు. కనుక జాగ్రత్తగా ఉండాలి. అతిగా చేస్తే గర్వం కలుగుతుంది. నాలాగ పూజ చేసేవాళ్లు మరెవ్వరూ లేరనే అహంకారం తలెత్తుతుంది. ఇట్టి కార్యక్రమాలు మన అహంకారాన్ని బలపరిస్తే అవి ఏ విధంగానూ మనకు ఉపయోగపడవు.

పూజ, జపాదులు ముఖ్యమైనవే. అవి దేని కొరకు? కనుక మనం చేసే ప్రతి పనిని ఎందుకొరకు చేస్తున్నామని ప్రశ్నించుకోవాలి. "నేను గత నలభై సంవత్సరాలుగా పూజ జపాదులు చేస్తున్నాను" అని ఒకరు తెలిపితే, ఎన్నాళ్లు చేశామని కాదు, ఏ మేరకు మన మనస్సు మారిందని ప్రశ్నించుకోవాలి. ఇట్టి నిత్య కలాపాలలో ముఖ్యమయినదేమంటే ఎవరు పూజ చేస్తున్నారో, ఎవరు చదువుతున్నారో వారిపై దృష్టిని సారించాలి. కర్మ చేసేవారెవరు? అని పరీక్షించుకోవాలి. అలాగ చేయనంత కాలం మనస్సు అన్యమనస్కతకు గురి అవుతుంది. చేసే కర్మకు భంగం వాటిల్లుతుంది. ఇట్టి కర్మకు ఒక లక్ష్యముంటుంది. ఏమిటా లక్ష్యం? ఇక "నేను పూజ చేయాల్సిన అవసరం లేదు" అనే భావన రావాలి. అంటే "పూజ చేయను" అని కాదు. పూజ అనే కర్మ దానంతట అదే స్వయంగా ఆగిపోతుంది. ఎట్లాగంటే, చెట్టున కాచిన కాయ, పక్వము చెందగానే తానంతట రాలిపోతుంది. అట్లాగే కర్మలు, ఆచారాలు అవి పక్వము చెందగానే వాటంతట అవి ఆగిపోతాయి. పక్వము అంటే "ఈ పూజ ఎవరు చేస్తున్నారు?" అనే విచారణ తలెత్తి కర్తృత్వ భావం పోవటమే పక్వం చెందడం.

మరొక విధంగా ఈ విషయాన్ని పరిశీలిద్దాం. ఎన్నో తీర్థయాత్రలు, పుణ్యస్థలాలను దర్శిస్తారు. ఇది మంచిదే. కాని ఇదే మన ధ్యేయమా? ఇదే జీవిత లక్ష్యమా? మనలో ఒక పరివర్తన రావాలి. ఈ పరివర్తన కలిగినట్లయితే తీర్థయాత్రల అనుభవం మనలోనే కలుగుతుంది. అంటే తిరువణ్ణామలై నాలోనే వున్నదనే భావం ఒక సమయంలో కలుగుతుంది. అంటే తిరువణ్ణామలై వెళ్లకూడదని కాదు. వెళ్లలేకపోయినప్పుడు దాని గురించి దిగులు చెందవలసిన పని లేదు. అయ్యో, నేను అరుణాచలం వెళ్లలేదే, ప్రదక్షిణం చేయలేదే, నేను హుండీలో అనుకొన్న డబ్బు వేయలేదే. అందువలనే ఈ కష్టం వచ్చిందా అని చింతించకూడదు. ఇటువంటి విషయాలలో మిత్రులు, బంధువులు ఎన్నో చెబుతారు. బదులుగా, మనలో ఒక భావం కలగాలి. వచ్చే కష్టాలన్నీ భగవంతుడే కలుగజేశాడని భావించకూడదు.

భగవంతుడు నిరంకుశ పాలకుడు కాదు. అతడు ప్రేమ స్వరూపుడనినపుడు ఇక భగవంతుడు భక్తులను శిక్షించడ మేమిటి? అతడు భయపడవలసిన ఒక వ్యక్తి కాదు. ముఖ్యంగా శ్రీరమణుల మార్గంలో వచ్చిన వారందరూ భయం గురించి ఆలోచించనవసరం లేదు. భయం నిరుపయోగమైనది. భగవాన్ బోధించేది ఒకటే, అన్నీ భగవంతుని సంకల్పములే అంటూ వాటిని స్వీకరించాలని. శుభాశుభములు ఏవి కలిగినా అవి ఎందుకు జరిగాయో ఎవరికీ తెలియదు. మన మేధస్సుతో వాటిని వివరించగలమా? యోగులు, ఋషులు కూడా ఎన్నో కష్టాలను అనుభవించారు. వాటి గురించి వారెవ్వరూ చెప్పరు. క్రీస్తును



సిలువ వేశారు, మహాత్మాగాంధి గారిని కాల్చి చంపారు. కెన్నెడీని తుపాకి గుళ్లకు బలిచేశారు. జిడ్డుకృష్ణమూర్తిగారు కాన్సరు వ్యాధితో చనిపోయారు. ఇలా ఎందరో! అట్టి మహాత్ములకు ఇట్టి మరణమా? మనకు సమాధానం దొరకదు. మనము కూడా ఎట్టి పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తిని పొందడమే వీటి నుండి మనం నేర్చుకొనవలసినది.

మనకు జరగరానిది జరిగితే దాని గురించి ఫిర్యాదు చేయ కూడదు. అది సమస్యలకు పరిష్కారం కాదు. శాంతి లభించదు. "అంతా భగవదేచ్ఛ" అని స్వీకరించాలి. అలా స్వీకరించాలంటే మనలో కర్తృత్వభావం ఉండకూడదు. లేదా సంపూర్ణ శరణాగతి చెందాలి. శరణొందడం అంటే అది నీకు నీవే శరణొందడమే యని భగవాన్ చెబుతారు. నీవే భగవంతుడవు. ఆత్మ ఎవరు? ఆత్మయే గురువు, భగవంతుడు, నీవు. నమ్మగలమా? మనకు మనమే శరణొందితే ఆనందంగా ఉండగలమా? ఉండగల మంటారు భగవాన్. ఆయన చెప్పింది ఒకటే. నిత్యమూ నిద్రలో మన మనస్సు మనకు శరణొందడం లేదా? దీర్ఘ నిద్రలో మనస్సు లేదు. మనస్సు ఆత్మలో కలిసి పోయింది. మరి దీనిని నిరూపించడం ఎట్లా? ఇలాగ. మనస్సు ఉన్నప్పుడు అంతా వ్యాకులతతో నిండి వుంటుంది. అన్నీ తలపులే.

ఇంతకీ మనస్సంటే? మనస్సంటే తలపులమూట. మనస్సు అంటూ ఒకటి లేదు. ఆలోచనల సమూహాన్ని మనస్సంటు న్నాము. దీర్ఘనిద్రలో తలపులు లేవు కదా! మనస్సు ఎక్కడో మాయమయిందని భావిస్తాము. దీర్ఘ నిద్రలో తలపులు లేవన్న

విషయం మనకు తెలియదు. మెలకువ రాగానే బాగా నిద్ర పోయామనుకుంటాము. కారణం నిద్రలో మనస్సు లేదు. మనస్సు ఏమయింది? అది ఆత్మలో కలిసి పోయింది. అందుకే నిద్ర నుండి మేల్కొనగానే హాయిగా నిద్రపోయామంటాము. అంటే మనస్సు లేనప్పుడు, మరొకటి ఏదో ఆ నిద్రను అనుభవిస్తోంది. ప్రొద్దుట ఆత్మ నుండి మనస్సు మళ్లీ ఉదయించగానే ఒక అసాధారణమైన ప్రక్రియ ప్రతిదినము జరుగుతుంది. దీర్ఘ నిద్రలో మన పేరు, ప్రతిష్ఠలు ఏమీ మనకు తెలియవు. మేల్కొన్న పిదపే ఆత్మ నుండి మనస్సు తిరిగి పుట్టి దేహం స్పృహను పొందుతోంది. ఆ వెంటనే ప్రపంచం అంతా గోచరిస్తున్నది. మనస్సు, దేహం, జగత్తూ ఈ మూడూ ఒకేమారు కన్పించి, ఒకేమారు అదృశ్య మవుతాయి. కాని ఇవేవి మనకు తెలియవు. మెలకువ తరువాతనే తెలుస్తుంది మనం బాగా, సుఖంగా నిద్ర పోయామని. అందుకే నిద్ర సుఖాన్ని అనుభవించేది ఒకటి ఏదో వుందని తెలుస్తోంది.

నిద్ర అంటే, ఆలోచనలు లేని ఒక స్థితి. మెలకువలో మనం చూస్తున్నవి ఏమీ లేని స్థితి. కాని అదొక సుఖమయిన స్థితి. మేల్కొన్న తర్వాతే ఆ సుఖం గురించి వివరించగలుగుతాం. ఆ స్థితిలో వ్యక్తిత్వము ఉండదు. కర్తృత్వ భావం, అహంకారం లేని స్థితి అని భగవాన్ బోధిస్తున్నారు. కేవలం సుఖమే అక్కడ వున్నది. మేల్కొన్న వెంటనే అలసట తీరి నూతనోత్సాహంగా వుంటాము. ఇట్టి స్థితినే తరువాత మెలకువలో పొందగలమా? అని భగవాన్ మనలను అడిగే ప్రశ్న. అహంకారం లేనపుడే ఈ సుఖం



కల్గుతుంది. కారణం అట్టి స్థితిలో వ్యక్తిత్వం లేదు. కనుక అట్టి స్థితిని మెలకువలో పొందటానికి ప్రయత్నించాలి. మూడు అవస్థలలో అనగా జాగృత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో (మెలకువ, స్వప్నం, దీర్ఘనిద్రలో) ఒకే వస్తువు ఉన్నది. మెలకువలో ఆ వున్నదేదో తెలుస్తుంది. దానివలనే వివేకం కలుగుతుంది. మనస్సు స్వప్నంలో సూక్ష్మ రూపంలో వుంటుంది. కలలన్నీ మనస్సు సూక్ష్మ రూపంలో వున్నప్పుడే కలుగుతాయి. సుషుప్తి, అంటే దీర్ఘ నిద్రలో మనస్సులేదు. అట్టి స్థితిలో మానసిక ఆందోళనలు, నాది, నేను అనేది లేవు. కాని ఈ మూడు అవస్థలలోనూ ఉన్నది ఏదో అదే ఆత్మ. భగవాన్ ఆ ఆత్మ స్థితిలో నిలకడ చెందివుండు అంటారు. అట్లాగ నిలకడగా వున్నట్లయితే అసంతృప్తి, చింతలు, ఆందోళనలు ఏమీ ఉండవు. ఏమి జరిగినా అవి మనల్ని బాధించవు. దీర్ఘ సుఖ నిద్రలో వున్నట్లు మెలకువలో కూడా అట్లాగే వుండగల్గుతాము. బాధపడే ఆ మనస్సు వుండదు. స్పృహ పోయినపుడు, మత్తుమందు ఇచ్చినపుడు నొప్పి వుండదు. కారణం అక్కడ మనస్సు లేదు. అంటే బాధపడే వాడు అక్కడ లేడు. దేహస్మృతి లేకుంటే బాధ లేదు. శంకరులు, భగవాన్ రమణులు చెప్పేది అదే.

భగవాన్‌కు కాన్సరు వ్యాధి సోకింది. కాని భక్తులు వారిని దర్శించినపుడు వారు ఎట్టి బాధలు లేక సదా ప్రకాశ స్వరూపులుగా వెలుగొంది కనబడ్డారు. కారణం వారు శరీర భావన నుండి విడి వడ్డారు. శరీర భావన నుండి విడిపడాలంటే దేహాత్మ భావం,

అహంకారం పోవాలి. అట్టి స్థితినే మనము నిత్యమూ నిద్రలో అనుభవిస్తున్నాము. మనస్సు ఆత్మలో లయమైంది కాబట్టి మన సమస్యలు అక్కడ తెలియటం లేదు.

ఆనందమే మన సహజ స్వభావం. అనేక శతాబ్దాల తర్వాత శ్రీ భగవాన్ అవతరించి ఈ సత్యాన్ని మనకు అందించారు. పురాణాలు చదవండి, వేదాలు పఠించండి అని చెప్పడానికి వారు రాలేదు, మనందరికి కూడ ఆనంద స్థితిని పొందటానికి సాధ్యమని చెప్పారు. ఈ లోకం నుండి ఎలాంటి సుఖాలను ఆశించకుండ వుంటే, మనమెవరో తెలుసుకోగలమన్నారు భగవాన్. దానికి తగిన శ్రద్ధ వుండాలన్నారు. భగవాన్ బోధించిన సిద్ధాంతం ఒకటే: నేనెవరు? అనే విచారణ. నిద్రలోని సుఖాన్ని మెలకువలోనూ పొందగలము.

జీవ, శరీర, జగత్తులు ఏవీ కూడ నిద్రలో లేవు. విచిత్రమేమి టంటే నిద్రలోనికి మనము ఎప్పుడు జారుకుంటామో ఎవ్వరికీ తెలియదు. తెలుసు అని చెప్పడానికి అక్కడ ఎవ్వరూ లేరు. భగవాన్ తెలిపే పద్ధతి ఇదే - మెలకువ రాగానే పడక నుండి హఠాత్తుగ లేవకుండా ఆత్మ నుండి మెల్లగా లేచే మనస్సును తిరిగి ఆత్మలోనే నిలకడ చెందేలాగ చేయాలని అంటారు. పూజ, జపం లోక వ్యవహారాల గురించి ఆలోచించకుండ, ఇతర దినచర్యలు చేయాలని ఏదీ ఆలోచించక, నీలో నీవు ఉండా లంటారు భగవాన్. ఆత్మనిష్ఠుడవై ఉండాలన్నారు. తెలివిగా ఉన్నప్పుడు ఆత్మలోనికి వెళ్లాలి అని అంటారు భగవాన్.



# రమణ స్వరూపులు, పూజ్యులు శ్రీ కె.ఎస్. గారు

- దోనెపూడి వెంకయ్య

పూజ్యులు శ్రీ కె.ఎస్. గారిని మొదటగా మేము (నేను, రాళ్ళ భండి శ్రీరామమూర్తి) 1991-92లో దర్శించే భాగ్యం కలిగింది. అప్పుడు హైదరాబాదులో సత్సంగాలు ఆంధ్ర మహిళాసభ కాలేజీ గాంధీ హాలులో జరిగేవి. మేము అక్కడికి వెళ్ళాము. దానికి ఒక కారణం వుంది. "శ్రీరమణ అష్టోత్తర వ్యాఖ్యానము" అనే గ్రంథమును వ్రాసి వ్రాతప్రతిని మేము శ్రీరమణాశ్రమం వారికి పంపగా, వారు ఆమోదించి, దానిని ఆశ్రమం తరఫున అచ్చు వేయిస్తామని చెప్పారు. మమ్మల్ని హైదరాబాదు వెళ్ళి శ్రీ కె.ఎస్. గారి ఆశీస్సులు తీసుకోవలసిందని సూచించారు. ఆ వ్రాతప్రతిని శ్రీ కె.ఎస్. గారికి వారు పంపి వారి అభిప్రాయము పొందినట్లు తెలిసింది.

గాంధీ హాలులో సత్సంగం అయిన తరువాత మేము శ్రీ కె.ఎస్. గారికి పాదాభివందనం చేసి, మా రాకకు కారణం తెలిపాము. వారు సంతోషించి, ఆ గ్రంథమును గూర్చి ప్రశంసాపూర్వకంగా మాట్లాడారు. తమ ఇంటికి రావలసిందిగా ఆహ్వానించారు. ఆ సాయంత్రం వారి యింటికి వెళ్ళాము. వారులోనికి ఆహ్వానించి కూర్చోమన్నారు. వారి చెంతనే చాలా సన్నగా రమణనామం టేపు రికార్డర్‌లో వినిపిస్తోంది. భగవాన్ గురించి రెండు మాటలు చెప్పవలసిందని అర్థించాము.

వారు భగవాన్ గురించి చెబుతూ వుండగా వారి కన్నుల నుండి హర్షాశ్రువులు ధారగా ప్రవహింప సాగాయి. భక్త్యావేశంలో

వారి గొంతు గద్గదికమై వారి ప్రసంగాన్ని కొనసాగించలేక పోయారు. మాకు అర్థం కాలేదు. మేము ఆశ్చర్యంతో తబ్బిబ్బు అయినాము. అలాంటి దృశ్యాన్ని మేము ఎన్నడూ చూడలేదు. భగవాన్ భగవద్భక్తుల గాథలు చదువుతూ అలాంటి స్థితిని పొందారని చదివాము గాని, ఇది ప్రత్యక్షంగా చూసిన దృశ్యం. ఎట్టివి చదివినా మాకు అలా అశ్రువులు కారవు కదా! అంత గట్టి గుండెలు మావి. వారిని ఆ దశలో అనగా అర్ధనిమీలిత నేత్రాలతో, కన్నీరు కారుస్తూ, డగ్గుత్తికతో వున్న దశలో చూచిన ఆ క్షణాలు యింకా మా స్మృతిలో వున్నాయి. ఇంతలో వారి శ్రీమతిగారు ఏదో పానీయం తెచ్చి ఇవ్వటం, తరువాత శలవు తీసుకొని మేము వెళ్ళటం జరిగింది.

పూజ్యులు శ్రీ కె.ఎస్. గారి గొప్పతనం ఏమిటో, భగవాన్ పట్ల వారి భక్తి ఏ స్థాయిలో వుండేదో తరువాత తరువాత అంటే వారిని గురించిన రచనలు చదివిన తరువాత మాకు అర్థమయింది. వారి విగ్రహం చిన్నది, కాని వారి వినయం గొప్పది. వారు మాతో వినయముగా వ్యవహరించారు. మేము కూడ ఆ స్థాయిలో ప్రవర్తించలేకపోయాము. అదీ వారి వినయమూ, వారి సౌజన్యము.

భగవాన్‌తో మమేకమై ఉండిన పూజ్యులు శ్రీ కె.ఎస్.గారి సందర్శనం మాకొక గొప్ప అనుభవము. అది మాకు మహద్భాగ్యము. మేము శ్రీరమణాశ్రమంలో శ్రీరామస్వామి పిళ్ళై, శ్రీ కుంజుస్వామి, శ్రీమతి కనకమ్మ, శ్రీ బలరామ రెడ్డి మొదలైన వారిని చూచిన అనుభూతి వంటి అనుభూతినే పూజ్యులు శ్రీ కె.ఎస్. గారిని కలిసినపుడు పొందాము.



# ధన్యజీవి డా॥ కె.ఎస్. గారు

- అ.వెం. రమణయ్య

శ్రీ కె.ఎస్.గారు నిశ్చయముగా ఒక జ్ఞాని. అందులో సందేహమే లేదు. ఈ క్రింది ఉదాహరణలే దీనిని రూఢిపరుస్తాయి.

వారు కరుణాస్వరూపులు. అందరి పట్ల దయ కలిగినవారు. వారి దగ్గరకు రమణభక్తులు ఏ సమయములోనైనా వెళ్లి కలవవచ్చు. భక్తులు తమ కష్టములు చెప్పుకునేవారు. వారి దృష్టికి తీసుకువెళ్లడం వలన ఆ కష్టాలు తీరేవి. భక్తులు శాంతి పొందేవారు. వారిని దర్శిస్తే వారిని ప్రేమించవలసిందే. పెద్దలు, పిల్లలు, వివిధ వ్యాపకాల్లో ఉన్నవారు వారి సన్నిధిలో శాంతిని పొందేవారు. తెలిసినవారికీ, తెలియని వారికీ సహాయం చేసేవారు. వారు ఎల్లవేళలా ఆనందంగా ఉండేవారు. నిరాడంబరులు. దేని పట్లా వ్యామోహం, కోరికా లేనివారు. చాలా వైరాగ్య సంపన్నులు. వారు జీవించిన విధానాలే యితరులకు చెప్పేవారు. వారు మంచి అనుకున్న విషయం పట్ల దృఢంగా ఉండేవారు. ఏ మాత్రం రాజీపడకుండా. ప్రపంచంలో వారికి తెలియని విషయమే లేదని అనిపిస్తుంది.

వారికి చాలా అతీత శక్తులు ఉన్నాయి. కానీ వారికి శక్తులు లేవనే చెప్పేవారు. వారికి శక్తులు ఉన్నాయని తెలిస్తే భక్తులు వారిని చేరడానికి భయపడతారని అట్లా మామూలుగా జీవించేవారు.

వారి శక్తులకు సంబంధించీ, వారి దయా గుణానికి సంబంధించీ, వారి సద్గుణ సంపదల గురించీ, కొన్ని ఉదాహరణలను స్మరించుకుందాం.

ఎవరయినా భక్తులు కష్టాల్లో ఉంటే వారికి ఎవరు చెప్పక పోయినా తెలిసేది. వారు వెళ్లి ఓదార్చి, పలకరించి వచ్చేవారు. అవతలి వారికి ఎంతో స్వాంతన కలిగేది. సి.డబ్ల్యు.సి. లో పనిచేసే బాలక్రిష్ణన్ గారి యింటికి వెళ్లి కె.ఎస్. గారు కలిశారు. వారి భార్య చనిపోయింది, యిద్దరు చిన్నపిల్లలను దగ్గర కూర్చోపెట్టు కొని దుఃఖంలో ఉన్నారు.

హిందీ మహా విద్యాలయ ప్రిన్సిపాలు, శ్రీ సుబ్రమణ్యం గారు చిన్న కారణంతో మనోవ్యథలో ఉన్నారు. కె.ఎస్.గారు వెళ్లి శాంతపరచి వచ్చారు. కొందరు కష్టాల్లో లేకున్నా కూడా, వారి మీద అపారమయిన దయతో వాళ్ల యింటికి వెళ్లి దర్శనం యిచ్చేవారు. ఆ భక్తుల సంతోషానికి అంతే ఉండదు.

శ్రీశ్రీశ్రీ చిన్నజీయరు స్వామివారు రాజమండ్రిలో వేంచేసి ఉన్నప్పుడు, వారికి ఇంగ్లీషు భాషలోని సందేహాలను తీర్చడానికి కె.ఎస్.గారు రాజమండ్రి వెళ్లారు. ఆ సమయంలో వీరు ఏ.ఎస్.ఎన్. మూర్తిగారింటికి వెళ్లారు. వీరి దర్శనం కలుగగానే మూర్తిగారు కన్నీళ్ల పర్యంతం అయి ఉబ్బితబ్బిబ్బు అయ్యారు.

ఒకసారి నింబోలి అడ్డలో (హైద్రాబాద్) ఉంటున్న కె. రామకిషన్ యింటికీ, జె. యాదయ్యగారి యింటికి వెళ్లి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. వీరి దర్శన భాగ్యానికి భక్తుల సంతోషానికి అంతే లేదు.

ఎవరయినా భక్తులు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంటే వెళ్లి వచ్చేవారు. కొద్దిసేపు "అరుణాచల శివ" నామం చెప్పేవారు. రోగికి ఉపశమనం, స్వాంతన కలిగేది. ఊహించనిరీతిలో వీరి ద్వారా రోగికి అనారోగ్యం తగ్గేది. జి.వి. రాజేశ్వర రావు గారి భార్య



రాధమ్మగారు దుర్గాబాయి దేశముఖ్ హాస్పిటల్లో ఉన్నప్పుడు కె.ఎస్.గారి దర్శనం వల్ల వెంటనే అనారోగ్యం తగ్గింది.

ప్రొ॥ శివమోన్‌లాల్ గారు హైదరాబాద్ నర్సింగ్‌హోము హాస్పిటల్లో ఉంటే కె.ఎస్.గారు రోజూ వెళ్లి చూసివచ్చేవారు. మామూలుగా ఎవరయినా ఒకసారి వెళ్లివస్తారు. కానీ వీరు అన్నీట్లోనూ ప్రత్యేకమే.

శ్రీరమణ భగవానులు ఏ పని చేసినా బాగా జరిగేది. అందువల్ల వారి "బంగారు చేయి" అనే పేరు ఉంది. కె.ఎస్.గారిదీ "బంగారు చేయి" (తంగక్కై).

కె.ఎస్.గారు హైద్రాబాదులో "శ్రీరమణ కేంద్రం" స్థాపించారు 1979లో. అది మూడుపువ్వులు ఆరుకాయలు అన్నట్టుగా దినదినాభివృద్ధి చెందుతూ భక్తులను ఆకర్షిస్తూ ఆత్మజ్ఞానం వైపుగా తీసుకు వెళ్తోంది. భావితరాలకూ యిది భాగ్యమే.

CIEFL లో (యిప్పుడు EFLU) వీరు ఇంగ్లీషులో correspondence course ను ఏర్పాటు చేశారు. అది యిప్పుడు ఎంతోమందికి విద్యాదానం చేస్తోంది. గొప్ప పెరుగుదలతో సాగుతుంది.

ఒకసారి వీరి ఆరోగ్య లోపాల ప్రస్తావన వచ్చింది. అప్పుడు అక్కడనే ఉన్న కేంద్రం భక్తులొకరు. మీకు యిట్లా యిబ్బందులు ఉంటే సత్సంగాలూ, భక్తులు అంటూ ఎందుకు తిరుగుతారు అని అన్నారు. దానికి కె.ఎస్.గారి జవాబు: తలుపులు వేసుకొని యింట్లో కూర్చుంటే చావు రాదా? యితరుల గురించి ఆలోచించని జన్మ కూడా ఒక జన్మేనా? అని అన్నారు.

భక్తులు వారి పిల్లలకు కె.ఎస్. గారితో నామకరణం చేయించు కున్నారు - అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు. అట్టిది వారి

సౌలభ్యం. ఒక భక్తునికి సంతానం లేకపోవడంతో వీరిని ఆశీర్వదించమని ప్రార్థించారు. వారి కోరిక నెరవేరింది. కష్టాల్లో ఉన్న భక్తులు కె.ఎస్.గారిని చేరి లబ్ధి పొందేవారు.

ఒకసారి కె.ఎస్.గారు గుండె యిబ్బందితో హాస్పిటలులో ఐ.సి.యు.లో ఉన్నారు. ప్రక్కన వీరి శ్రీమతిగారు, వీరి మరదలు ఉన్నారు. ముగ్గురూ కలసి లలితాసహస్రనామ పారాయణ చేశారు. తెల్లవారి పక్క బెడ్‌లో ఉన్న రోగి తండ్రి వీరి వద్దకు వచ్చి కృతజ్ఞత తెలుపుతూ, మా అమ్మాయి చాలా రోజులుగా రాత్రిపూట నిద్రపోవట్లేదు. నిన్న మీరు పారాయణ చేశారు. రాత్రి మా అమ్మాయి బాగా నిద్రపోయింది అని అన్నారు. అట్లా కె.ఎస్. గారికి తను ఐసియు లో ఉండి కూడా యితరుల క్షేమం గురించే పట్టింపు.

కె.ఎస్.గారు CIEFL క్వార్టర్స్‌లో నెం.7లో ఉండేవారు చాలా కాలంగా. వారు యిల్లు ఖాళీ చేసినప్పుడు ఇంటి మొత్తానికి వీరి స్వంత ఖర్చుతో రంగులు వేయించి అప్పగించారు. ఇంటి వెనుక దొడ్లో ఒక మామిడి చెట్టు ఉంది. వీరు ఇల్లు ఖాళీ చేస్తుంటే తోటమాలి వచ్చి అయ్యా తమరు వెళ్తున్నారు. ఈ సంవత్సరం ఈ మామిడి చెట్టు కాయలు కాయదు అన్నాడు. అట్లాగే ఆ సంవత్సరం ఆ చెట్టుకు కాయలు కాయలేదు. అట్టిది కె.ఎస్.గారి ప్రేమ ప్రకృతి పట్ల కూడా.

ఎల్లవేళలా వీరి ఆలోచనలు మొత్తం శ్రీరమణుల గురించే ఉండేవి. ఎవరు ఏ సమయంలో వారిని కలిసినా, భగవాన్ గురించి ఆశ్రమం గురించి, అక్కడ జరుగుతుండే విశేషాల గురించి చెబుతుండేవారు.



'నేను దేహం చాలిస్తాను' అంటూ వీరు వీరి శ్రీమతిగారితో అంటూ ఉంటే, పిల్లలు అమెరికాలో ఉన్నారు - వారిని రానివ్వండి అంటూ వీరి శ్రీమతిగారు సముదాయిస్తూ వచ్చారు. కుమారుడు, కోడలు పి.హెచ్‌డి. ముగించుకొని డిసెంబరు 11న వచ్చారు. కె.ఎస్.గారు జనవరి 11న దేహం చాలించారు. వారి యిష్ట ప్రకారం దేహం చాలించగలిగిన శక్తిమంతులు. వీరు దేహం చాలించి నప్పుడు పరిసరాలు అంతా పుష్కలంగా శాంతితో నిండి ఉంది. అటువంటి శాంతమూర్తి. హాస్పిటలులో ఉండగా వీరికి ట్యూబు అమర్చినారు. వీరి యజ్ఞోపవీతం చిక్కులు పడగా దానిని డాక్టర్లు కత్తిరించి తీసివేసినారు. ఇది సన్యాసదీక్షగా తీసుకోవచ్చా? ఆ సమయంలోనే శ్రీరమణాశ్రమం నుండి వచ్చిన విభూతి, కుంకుమ ప్రసాదంలో బిల్వ దళం కూడా వచ్చింది. కె.ఎస్.గారు దేహం చాలిస్తారని ఆ బిల్వాన్ని చూడగానే వీరి శ్రీమతిగారికి అనిపించింది. కె.ఎస్.గారు ముందే కొన్ని అప్పగింతలు చెప్పారు: ఈ దేహానికి ఎట్టి ఉపచారాలు స్నానంతో సహా అవసరం లేదు. ఎలెక్ట్రికల్ క్రెమటోరియం లోనే దహనం చేయాలి. అట్లా చేస్తే ప్రకృతికి అపచారం ఉండదు.

ఈ శాంతమూర్తి యిప్పుడు దేహంలో లేక పోయినా వారి ఉనికిని భక్తులు అనుభవిస్తున్నారు. వీరిని తలచుకొంటే శాంతి వస్తుంది. ఏదయినా యిబ్బంది వస్తే నేను కె.ఎస్.గారిని తలచుకొంటానండీ, అప్పుడు నాకు కె.ఎస్. అనే రెండు అక్షరాలు మెరుస్తూ కనిపించుతాయండి - అన్నది ఒక భక్తుని అనుభవం.

కె.ఎస్.గారు చిరంజీవి.

కె.ఎస్.గారికి ప్రణామములతో.

# డా॥ కె.ఎస్. గారి విశిష్టత

**శ్రీమతి పెమ్మరాజు రాధమ్మ సుబ్బారావు**

హైదరాబాదులో శ్రీరమణకేంద్రాన్ని స్థాపించి దానికి ప్రథమ అధ్యక్షులైన డా. కె. సుబ్రహ్మణియన్‌గారిని మనం ప్రేమతో డా. కె.ఎస్.గారు అని పిలుచుకుంటాం. వారిని గురించి మనం ఎంత చెప్పినా అది పరిపూర్ణం అయినట్టు కాదు. అటువంటిది డా. కె.ఎస్.గారి విశిష్టత. వారు అరుదైన, అపూర్వ కళ్యాణ గుణాలకు నిలయం.

చిన్నప్పటి నుండి కూడ డాంబికం లేని అతి సామాన్యమైన జీవనసరళి వారిది. బాలుడుగా ఉన్నప్పుడే తనకేది పెట్టినా దానిని స్నేహితులకు కొద్దికొద్దిగానైనా పంచేవారు. వారు తమ తల్లి దండ్రులకు ఒకే కుమారుడైనందువల్ల వారి అమ్మగారు ఏదైనా క్రొత్త వంటకం చేద్దామని అన్నా వారు సుతరామూ అంగీకరించే వారు కాదు. కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి అతి సామాన్యంగా ఉండేవారు. కాళ్ళకు చెప్పులు కూడ వాడేవారు కాదు. స్తోమత ఉన్నప్పటికీ, సామాన్య జీవితాన్నే గడిపేవారు. అలాగ చిన్నప్పటి నుండి సమత్వ-వైరాగ్య గుణాలను కలగి వుండే వారు. కాలేజీ హాస్టల్‌లో వుండగా, తమ ఒక పూట భోజనాన్ని ఒక పేద విద్యార్థికి ఇచ్చే ఏర్పాటు చేసి తాము రాత్రి భోజనం తీసుకొనడం మానివేశారు. అధమం పాలు అయినా తీసుకోమని వంటవాళ్ళు బ్రతిమిలాడేవారు. పెళ్ళిచూపులకు అందరూ చాలా ఆడంబరంగా తయారై వెళ్తారు. కాని వీరు ఊహించలేనంత



సాదాసీదాగా వెళ్ళారు.

హైదరాబాదులో 1979 సం॥లో శ్రీరమణకేంద్రం స్థాపించిన నాటి నుండి ప్రతినెల మూడవ ఆదివారం రోజున హబ్సిగుడా లోని వృద్ధాశ్రమంలో పేదలకు అన్నదానం చేయిస్తూ వచ్చారు. పండుగ సందర్భాలలో స్వీటు కూడ యిప్పించేవారు. ఆశ్రమ వాసులకు సులువుగా జీర్ణమయ్యే పదార్థాలనే ఇవ్వాలనేవారు. అక్కడ వున్నవారిలో ముగ్గురు-నలుగురికి తమలపాకులు వేసుకునే అలవాటు వున్నందున మరిచిపోకుండ వారికి ఆకులు, వక్క, సున్నం యిప్పించేవారు. ఎప్పుడైనా మూడవ ఆదివారం నాడు అన్నదానం జరిపే వీలుకాని పక్షంలో, ఆ విషయాన్ని ముందటి శనివారమే ఆ ఆశ్రమం వారికి కబురుపంపేవారు. నిజానికి ఆ సేవ శ్రీరమణకేంద్రం తరఫున జరుగుతున్న సంగతి ఆ వృద్ధులకు తెలియకపోవచ్చు కూడ.

చలికాలంలో రోడ్డు ప్రక్కన వుండే బీదవారికి పాతబట్టలు ప్రతి సంవత్సరం యిప్పించేవారు. ఆరోగ్యం బాగులేక ఆస్పత్రిలో వున్న బీదలకు కూడ బట్టలు ఇవ్వాలని గుర్తుచేసేవారు. అప్పుడప్పుడు రోడ్డు ప్రక్కన ఉండే పేదవారికి కొత్తచీరలు, పంచలు, దుప్పట్లు పంచేవారు.

అనారోగ్యంతో ఇంట్లో లేదా ఆస్పత్రిలో ఉన్న భక్తులను వారు ఒకటికి రెండుసార్లు వెళ్ళి చూసి వాళ్లకు ధైర్యం, శాంతిని అందించే వారు. ఎవరైనా చనిపోతే, వెళ్లి పరామర్శించి బంధువర్గానికి ధైర్యం చెప్పేవారు. రమణకేంద్రం సభ్యులు చేసిన తీర్మానాన్ని ఉత్తరంతో ఆ యింటి వారికి పంపించేవారు. అంటే, రమణ కుటుంబంలోని

వారందరూ మీతో కూడా ఉన్నామనే ధైర్యాన్ని ఆ కష్ట సందర్భంలో ఆ వ్యక్తి బంధువులకు తెలపాలన్న ఉద్దేశ్యంతో అలా చేసేవారు. చనిపోయిన వ్యక్తి గురించి భక్తులు రమణకేంద్ర సత్సంగాలలో మాట్లాడాలి. ఆపదలో వున్నవారి సరసన కూర్చొని "అరుణాచల" పవిత్ర నామాన్ని తాము ఉచ్చరిస్తూ మనతోనూ పలికించేవారు. ఆ యా సందర్భాలలో వాతావరణం అంతా శాంతితో నిండి పోయేది. సంబంధించిన వారందరికి నిబ్బరం, మనోధైర్యం నూటికి నూరు పాళ్ళు కలిగేది. అట్టిది వారి సానిధ్య మహిమ.

కాలేజీలో సీటు గురించి, అమ్మాయిల వివాహాలు, లేదా కుటుంబంలో అనారోగ్యాల గురించి, ఇతర ఇబ్బందుల గురించి భక్తులు డా. కె.ఎస్. గారికి విన్నవించుకునేవారు. వారి సహాయంతో కష్టాలు తీరేవి. పరిచయాలు ఉన్నా, లేకపోయినా, తమను ఆశ్రయించినవారికి, శక్తివంచన లేకుండ తగిన విధంగా సహాయపడేవారు. కాని ఆ విషయాన్నిబయటికి చెప్పుకునేవారు కాదు.

తమ పదవీకాలం పూర్తి కాకముందు, లేదా పదవీ విరమణ చేసిన తరువాత, యితర దేశాలకు వెళ్ళి ఎంతో డబ్బు సంపాదించ గలిగి వున్నప్పటికి అలాంటి అవకాశాలను తిరస్కరించేవారు. అలాంటి వ్యక్తులు వుంటారా ఈ రోజుల్లో? డా. కె.ఎస్.గారు తరచు పోస్టుకార్డుపై రమణ భగవాన్ బోధనా వాక్యాలలో ఏవో ఎంచుకుని భక్తులకు పంపేవారు. ఆ కార్డులోని విషయం, దానిని అందుకున్న భక్తులు అప్పుడున్న పరిస్థితికి సరిపోయే విధంగా వుండి వారికి ఊరట కలిగించేది.



నిత్యజీవితంలో నిశ్చింతగా, ప్రశాంతతో ఉండడానికి అవసరమైన విధానాలను, సూచనలను మనకు బోధించారు. వాటిని ఆచరించేలాగున అనుగ్రహించారు కూడ. రమణకేంద్ర సత్సంగాలలో భక్తులకు భగవాన్ జీవిత విశేషాలను చెప్పడంతో ప్రారంభించి శరణాగతి గురించి, "నేను ఎవరు" గురించి చెప్పే వారు. వారిలో భక్తిని పెంపొందింపజేసేవారు. సాధనాసూత్రాలను తెలుపుతూ ఆశీర్వదించి భక్తులలో మరణభయాన్ని తొలగింప జేశారు. అంతటి అనుగ్రహమూర్తులు డా. కె.ఎస్. గారు.

ఆంధ్ర మహిళాసభ కాలేజీలో ప్రతివారం జరుగుతుండిన రమణ సత్సంగానికి అక్కడి కుక్కలు కొన్ని వచ్చేవి. భక్తులతోబాటు అవి కూడ నిశ్శబ్దంగా ఉండేవి. అది గమనించిన డా. కె.ఎస్.గారు వాటికి తిండి ఏర్పాటు చేయించేవారు. భూతదయకు వారి వద్ద లోటు లేదు.

చిన్న, పెద్ద, హోదా, సంపదలు వగైరా విషయాలు అడ్డురాని విధంగా తారతమ్యాలు లేకుండ, భక్తుల మధ్య అంతరాలు లేకుండ, పూర్తి స్నేహం వెల్లివిరిసేలాగ చేశారు. అందరూ ఒకే కుటుంబంలోని వారుగా ప్రేమతో జీవిస్తూ వస్తున్నారు. అందరి పట్ల వారికి గల అపార ప్రేమ, కరుణ కారణంగా వారితో పరిచయమైన ప్రతి ఒక్కరూ తామంటేనే డా. కె.ఎస్. గారికి ఎక్కువ ప్రీతి అని భావించేవారు పిల్లలతో సహా అందరి అనుభవం అదే.

శ్రీరమణుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నూటికి నూరుపాళ్ళు అట్లాగే జీవించడం వల్ల డా. కె.ఎస్. గారి సన్నిధిలో

శాంతి పొంగిపొర్లేది. వీలున్నంత ఎక్కువ సమయం వారితో గడపాలని కోరుకొంటూ, వారి సాంగత్యాన్ని అభిలషించేవారు. మరొక ముఖ్య విషయం ఏమంటే, డా. కె.ఎస్.గారు దేహం చాలించి ఇంతకాలం గడిచినా ఇప్పటికీ నమ్మకంతో, ఆర్తితో వారిని స్మరించిన భక్తులకు వారి అభయహస్తం అనుగ్రహిస్తూ సహాయం చేస్తూనే ఉంది.

శ్రీ రమణకేంద్రం అనే కన్యను డా. కె.ఎస్.గారు కని, పెంచి, పోషించి యుక్తవయసు కన్యగా చేసి మనకు అప్పగించారు. ఈ కన్యామణి యొక్క బాగోగులు, బరువు బాధ్యతలు రమణ భక్తులమైన మనందరిపైన ఉంది. రాబోవు కాలంలో ఇది జ్ఞాన కేంద్రంగా విలసిల్లి సాధకులకు కొంగుబంగారమై నిలవాలన్న రమణ భక్తుల కోరిక తప్పక సిద్ధిస్తుంది.

**జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు మూడూ మనస్సువి. వీటికి అంటకుండా సాక్షిగా, అధిష్ఠానంగా వుండేది ఆత్మ. అవస్థలు మారుతూ వున్నా ఆత్మ స్వరూపుడైన నేను మారను. సినిమా తెరపై కదిలే బొమ్మలు తెరను ఏ విధంగానూ అంటనట్లు ఈ అవస్థలు మూడూ నన్ను ఏ మాత్రమూ అంటవు.**

**- మహర్షి**



# మహో మనీషి

- డా. వి. రామదాస్ మూర్తి

డా. కె. సుబ్రహ్మణియన్ గారి పేరు (హైదరాబాదులోని రమణ భక్తులు తిరువణ్ణామలై శ్రీ రమణాశ్రమంగా భావించే) శ్రీరమణ కేంద్రంతో విడదీయలేని విధంగా పెనవేసుకుంది. నగరంలోని రమణభక్తులను ఒక చోట చేర్చి, ఆ కేంద్రంలో క్రమపద్ధతిలో రమణ సత్సంగాలను నిర్వహించేలాగ చేసిన ఘనత డా. కె.ఎస్. గారిది. రమణమార్గంలో పయనించాలని ఆశించే అందరికీ మార్గదర్శనం చేసినది డా. కె.ఎస్.గారు.

బాలునిగా వున్నప్పుడే రమణమహర్షిని దర్శించగా మహర్షి కృపావీక్షణాలకు నోచుకున్న డా. కె.ఎస్. జీవితాంతం మహర్షి సూచించిన బాటలోనే గడిపారు. వారి బోధనలను తు.చ. తప్పకుండ ఆచరణలో పెట్టారు. వృత్తిపరంగా, తమ బాధ్యతలను ఎంత నిక్కచ్చిగా నిర్వర్తించారో, అంతకంటే పలురెట్లు మెరుగ్గా, ఆధ్యాత్మిక, మానవతా సూత్రాలను పాటించేవారు. అధికార హోదాలో తమకై ప్రత్యేక అనుచిత సౌకర్యాలను ఎప్పుడూ ఆశించ లేదు. నిజానికి తమకు ఎదురైన అవకాశాలను కూడ కాదన్నారు.

తమ జీవితాన్ని అతి సాదాసీదాగా, ఏ ఆడంబరాలు, పటాటోపాలు లేకుండ గడిపారు. వృత్తిపరమైన విధులను సమర్థ వంతంగా సాగిస్తూ, పత్రికారంగంలో తమదైన శైలిలో ప్రజోపకరమైన రచనలను చేస్తూ, మహర్షి భక్తులకు ఆధ్యాత్మిక పురోగతికి అవసరమైన సహాయాన్ని అందజేశారు. హాస్యప్రియులు

గనుక తమ ప్రసంగాలలో నిదర్శన పూర్వకంగా, విజ్ఞానాన్ని, హాస్యాన్ని జోడించి విషయాలను హృదయాలకు హత్తుకునేలాగ తెలియజెప్పేవారు.

చిన్నపిల్లలవంటి నిర్మల హృదయులు డా. కె.ఎస్. వాళ్ళతో కలిసిమెలిగేవారు. అమితమైన జ్ఞానతృష్ణ వారి ప్రత్యేకత. నడి వయసులో కూడ చిన్నపిల్లలతో కలిసి, ఏ జంకూలేకుండ కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. పలు భాషలను అభ్యసించారు. చిన్న పిల్లలను కూడ చిరునవ్వుతో పలకరించేవారు.

వృత్తిపరంగా ఎన్నో సమావేశాలు, సభలలో పాల్గొనడమే గాకుండ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడంలో దిట్ట. ఇంగ్లీషు భాషలో ఎంతో ప్రవీణులైనప్పటికి, మామూలు ప్రసంగాలలో ఎన్నడూ ఆ ప్రావీణ్యతను బయటపెట్టేవారు కాదు. ఆడంబరమైన భాషా శైలి లేకుండ విషయాన్ని వివరంగా తెలియబరుస్తూ, నలుగురితో పంచుకోవాలన్నదే వారి అభిమతం. సామాన్య ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొనే ఇబ్బందులను బహిర్గతం చేసి, కష్ట నివారణకు సహాయపడే ప్రయత్నాలు చేసేవారు.

డా. కె.ఎస్.గారు ఎంతో దైవభక్తిగలవారు. పీఠాధిపతులు, మతాచార్యుల పట్ల ప్రత్యేకంగా గౌరవ, భక్తి ప్రపత్తులు గలవారు. ముఖ్యంగా శ్రీరామచంద్రుడు, హనుమంతుడు అంటే ఎనలేని భక్తి. తమ ప్రసంగాలలో వారి ప్రసక్తి తరచు వచ్చేది. నిజంగా హనుమంతునివలె తమ శక్తిసామర్థ్యాలను బాహ్యంగా కనబడ నీయకుండ నిస్వార్థసేవ చేయడం డా. కె.ఎస్.గారి ప్రత్యేకత.

భగవాన్ యొక్క గొప్ప భక్తులైన విశ్వనాథస్వామిగారికీ, డా.



కె.ఎస్. గారి కుటుంబానికీ సన్నిహిత సంబంధాలుండేవి. వారితో సమయం గడిపిన ప్రతిసారీ, భగవాన్ గురించీ, నాయన (కావ్యకంఠ గణపతి ముని) గురించి ఎన్నో విషయాలను లోతుగా చర్చించుకునేవారు. చాలా సందర్భాలలో విశ్వనాథస్వామికి డా. కె.ఎస్. గారి మాతృమూర్తి భిక్ష సమర్పించుకునేవారు.

మానవ జీవితంలోని కష్టసుఖాలను, హెచ్చుతగ్గులను సమాన భావంతో స్వీకరించాలని డా. కె.ఎస్. అభిప్రాయం. అభిప్రాయమే కాదు, తమ జీవితంలో ఆచరించి చూపారు. భగవాన్‌వలె తమకు శారీరక బాధలు కలిగిన సమయాలలోను, వైద్యుల అభిప్రాయం ఎలా వున్నప్పటికి, శ్రీరమణ కేంద్రమూ, అందరు రమణ భక్తుల విషయాలలో మాత్రం ఏ తేడా లేకుండా అదే తరహాలో సేవలను కొనసాగించారు. భగవాన్ బోధనలను జీర్ణించుకున్న ఆయన మరో విధంగా ప్రవర్తించివుంటే ఆశ్చర్యపోవాలి. మనకు ఏది మంచిదో, మన కంటే భగవాన్‌కే బాగా తెలుసునన్న సూక్తిని తమ పిల్లలకే కాదు, రమణ భక్తులందరికీ తమ సంభాషణల ద్వారా నొక్కి చెప్పేవారు.

శరీరం అనారోగ్యానికి గురి అవుతున్న రోజుల్లో కూడ నగరం లోని దూరప్రాంతాలలో నివసిస్తున్న రమణ భక్తుల ఇళ్ళల్లో భగవాన్ యొక్క పునర్వసు పూజలకు హాజరవుతూనే వుండే వారు. క్రమంగా వారి కార్యక్రమాలు శ్రీరమణ కేంద్రానికి పరిమితం కావలసి వచ్చింది. కాని ఎప్పుడూ తమ అనారోగ్యాన్ని గురించిన ప్రస్తావన లేకుండ మౌనంగా భరించడం వారి గొప్పతనం. ఏ బాహ్యమైన అలజడి లేకుండ ప్రశాంతంగా దేహాన్ని చాలించారు.

మహర్షి భక్తులు, హైదరాబాద్ శ్రీరమణకేంద్రం ముఖ్య సభ్యులు అయిన శ్రీ జి. రాజేశ్వర రావుగారి ప్రోత్సాహంతో, తరచు వారి అనునయ వాక్యాలతో మొదట నా శ్రీమతి, ఆ తరువాతి కాలంలో నేను, రమణకేంద్రానికి రావడం మా కుటుంబంలో ఒక శుభ పరిణామంగా భావిస్తున్నాను. అంతకంటే గొప్ప భాగ్యం డా. కె.ఎస్. గారితో సన్నిహిత సంబంధాలు పెంపొందించుకొనడం. పలు సందర్భాలలో తమ విలువైన సూచనలను మాకు వ్యక్తిగతంగా అందిస్తూనే వచ్చారు. నేను పని చేస్తూవుండిన ఎన్.ఐ.ఎన్. కు ఒక పనిమీద రావడం కూడ జరిగింది. నేను డాక్టరేట్ చేస్తున్న రోజుల్లో కేంద్రంలో కలిసిన ప్రతిసారీ పని ఎంతవరకూ వచ్చిందని అడుగుతుండేవారు. మా కుటుంబం వారికి ఎంతో ఋణపడి వుంది.

రమణ భగవాన్ జీవిత కాలంలో వారి ప్రముఖ భక్తులు, ఎన్నో ఏళ్ళు డా. కె.ఎస్. గారితో అతి సన్నిహితంగా మెలిగిన శ్రీ నిడుముసలి బలరామరెడ్డిగారు అభిప్రాయపడినట్లు "డా. కె. సుబ్రహ్మణియన్ గారు శ్రీ భగవాన్ అనుగ్రహ ప్రవాహానికి ఉత్కృష్టమైన పాయ వంటి వారు" అన్నది అక్షరాలా నిజం. సుగుణములే చెప్పుకొంటి సుందర రఘురామా" అని శ్రీ త్యాగరాజస్వామివారు శ్రీరామచంద్రునిపై ఒక కీర్తన రచించారు. అలాగ డా. కె.ఎస్. గారి విషయంలో ఎంతగా చెబుతూ పోయినా సుగుణాలే కాని వేరొక్కటి ఏదీ కనిపించదు. అదే వారి గొప్పతనమూ, ప్రత్యేకత.

*ఆధారం: డా. కె. సుబ్రహ్మణియన్ - స్మరణాంజలి.*
*హైదరాబాద్ శ్రీరమణకేంద్ర ప్రచురణ నుండి సేకరణ.*



# శ్రీ సుబ్రహ్మణ్యులకు స్మృత్యంజలి

**- శ్రీమతి వి. త్రిపుర సుందరి**

'ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచుపోలిక' పరిచయమైన ప్రతి ఒక్కరిలో చెరగని ముద్రవేసిన ఆత్మీయుడు, ఆత్మబంధువు, అమృతమూర్తి శ్రీ కె.యస్. గారు ఆయనను గురించి యెంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన వ్యక్తిత్వమట్టిది.

చిన్ననాటనే భగవాన్ రమణ మహర్షి ఆకర్షణకులోనైన డా. కె.ఎస్.గారు, అతికొద్దిమంది భక్తులతో కలిసి, 1979 సం॥లో శ్రీరమణకేంద్రం అనే ఈ సంస్థను స్థాపించారు. అప్పట్లో దీని సమావేశాలు విద్యానగర్‌లోని హిందీ మహా విద్యాలయంలో జరిగేవి. ఇంతింతై, వటుడింతై అన్నట్లు, ఈ సంస్థ అంచెలంచెలుగా యెదిగి, తరువాత ఆంధ్రమహిళాసభ కళాశాల ఆవరణలోని గాంధీ శతాబ్ది భవనంలో తన సత్సంగాలను జరుపుకునేది. భక్తి, పవిత్రత, ప్రశాంతత, సేవాతత్పరత అనే నాలుగు మూల స్తంభాలపై మన కలలపంటగా నెలకొన్న శ్రీరమణమందిరంలో ఇపుడీ కేంద్రపు సత్సంగాలు జరుగుతున్నాయి. స్వామీజీ శ్రీరమణానంద సరస్వతి గారి కరకమలములచే ప్రారంభింపబడిన ఈ రమణ మందిరంలోనే మనము మన పూజ్య గురుదేవులు శ్రీ కె.ఎస్.గారి సంస్మరణ సభ జరుపుకున్నాం.

అతినిరాడంబరత, అత్యంత సౌమ్యత, అపార ప్రేమ, సమదృష్టి, మృదుభాషణ, సేవానిరతి, దర్శన సౌలభ్యం, మవునంగా బాధను భరించడం, మొదలైన సుగుణాలను, భగవాన్ రమణుల నుండి శ్రీ కె.ఎస్. పుణికి పుచ్చుకున్నారు. అహంకారం ఆయన దరిచేర వెఱచింది. రమణ భగవాన్ జీవిత విశేషాలను శ్రీ కె.ఎస్. గారి ముఖతః విన్నవారు రమణ మహర్షి పట్ల ఆకర్షణకు గురికాక తప్పదు. భగవాన్‌ను గురించి చెప్పేటప్పుడు ఆయన పరవశించడమే కాదు. విన్నవారినీ పరవశింప జేసేవారు. ఆయన సమక్షంలో సమయమే తెలిసేది కాదు.

జాతిపిత బాపూజీవలె యెదుటి వ్యక్తిలోని ఇసుమంత మంచి గుణాన్ని భూతద్దంలో చూపించి వారిని మెచ్చుకునేవారు డా. కె.ఎస్. ఎవరినీ పల్లెత్తుమాట అనని అజాతశత్రువాయన. శ్రీరమణ కేంద్రం సభ్యులు తమకు ఏ కష్టం వచ్చినా, తామే సమస్యల్లో చిక్కుకున్నా, ఆత్మబంధువైన ఆయనకు చెప్పుకునేవారు. ప్రతివారి సమస్యను సానుభూతితో పరిశీలించి, చక్కని పరిష్కారాన్ని సూచించి, వారిని తగు విధంగా అనునయించి పంపేవారు. ప్రతి విషయాన్ని, ఆయనకు తెల్పి సలహా తీసుకోడానికీ, ఆశీస్సులందు కోడానికీ, శ్రీరమణకేంద్ర సభ్యులు అతి ఉత్సాహం చూపించే వారు. పసిపాపలు మొదలుకొని పండు ముసలుల వరకు, అందరినీ ఒకే రకమైన మందహాసంతో పలుకరించేవారాయన. శ్రీ కె.ఎస్. తమకే అంత సన్నిహితులేమో, అని ప్రతి వారూ అనుకునేంత ఆత్మీయతను అందరకు పంచిపెట్టేవారు. అతి సామాన్యంగా కనిపించే, ఆ పట్టెడంత మనిషి మనసులో, ఇతరుల



మధురభావనలెన్నో పట్ల వారిపై ఆయన కురిపించే మమతాను రాగాలెన్నెన్నో.

మంచికి మారుపేరు, మానవత్వానికి ప్రతీక, అయిన ఆ మహనీయుని పరిచయం కావడం మన పూర్వజన్మ సుకృతమే. ప్రశాంతవదనంతో, చెదరని చిరునవ్వుతో, ఇటీవల దాకా మన మధ్య నడయాడిన, ఆ సౌజన్యమూర్తి భౌతికంగా లేకపోయినా, ఆ గురువర్యుని పవిత్రాత్మ శ్రీరమణమందిరం చుట్టూ తిరుగాడుతూ, భక్తులందరి హృదయాలలో గూడుకట్టుకొని వుంటుంది. డా. కె.ఎస్. వంటి మహనీయుని మనకందించిన ఆ మాతృమూర్తికి మా నమోవాకములు. శ్రీ కె.ఎస్. వంటి మహోన్నత వ్యక్తి నభూతో నభవిష్యతి.

శ్రీ సుబ్రహ్మణ్యులకు శిరసానమామి,
మా సుబ్రహ్మణ్యులను మనసాస్మరామి.
సుబ్రహ్మణ్యుల ప్రసాదమౌ శ్రీరమణకేంద్రము
భక్తులందరి కభయమొసగి బ్రోచుచును,
దినదినప్రవర్ధమానమై వర్ధిల్లుగాక.
ఆచంద్రతారార్కమై వెలుగొందుగాక!

**జ్ఞాన దృష్టి అలవరచుకొన్నప్పుడే ప్రపంచము బ్రహ్మ మయంగా కనిపిస్తుంది. బ్రహ్మ ఎవరో తెలియకుండ ఆయన సర్వమయత్వాన్ని ఎలా తెలుసుకోగలుగుతావు.**

డా. కె.ఎస్.గారికి అరవై వసంతాలు నిండిన శుభసమయాన గౌరవ
పూర్వకంగా అర్పించుకుంటున్న

# గేయమాలిక

శ్రీమతి వి. త్రిపుర సుందరి

1. భాగ్యనగరమునందు పదియేండ్లవాడు
మనుజహితముఁగోరి మహితాత్ములను గూడి
రమ్యమైన రీతి, రమణకేంద్రము నెలకొల్పి
బాధ్యత వహించి, భక్తుల నొక చోటఁ జేర్చి
రమణ నామస్మరణ, రమణీయమని తెల్పిన
అమృతమూర్తీ, నీకిదె అంజలి ఘటింతు.
2. మాటలకన్న మౌనమె మిన్నయని వక్కాణించి,
ధ్యానమగ్నత కత్యంత ప్రాధాన్యమొసగి,
రమణ బోధనం, జీవిత విశేషములఁ దెల్పి
ఆధ్యాత్మికతత్త్వము నతి సౌమ్యముగ బోధించి
పరమ ప్రశాంతిని ప్రసాదించు సౌజన్యమూర్తీ
సాదరమున సమర్పించు శత వందనములివిగో!
3. అలతి అతి మాటల ననల్పార్థమును సాధించె తిక్కన కలము,
చిన్నారి పొన్నారి పదముల విషయవివరణ సేయు నీదు గళము;
మందార మకరంద మాధుర్యమున తేలించె పోతన కలము,
తీయ తేనియ వంటి రమణ తత్త్వము వినిపించు నీదు గళము;
ముద్దుపల్కుల ముదము నెంతయు చేకూర్చె తిమ్మన కలము,
కమ్మని రమణగాథల కడు రమ్యముగ నుడువు నీదు గళము;
అతులిత మాధురీమహిమను కుప్పించె ధూర్జటి కలము,
రమణ చరితామృతధారలను కురిపించు నీదు గళము.
4. రమణుని కర్పించిన మాలలో కుసుమాలు మేమన్న
ఆ పూల నొకటిగ చేర్చిన దారము నీవు కాదె,



శ్రీరమణ కేంద్రము పటిష్ఠముగ పని చేయునన్న
ఆ పటిష్ఠతకు కారణమగు ప్రతిభ నీది కాదె,
ఈ కేంద్రమును నడుపునదొక సామూహిక శక్తి యున్న
ఆ శక్తికి మూలమగు వ్యక్తివి నీవు కావె,
మమతానురాగాలతో మేము కలిసియున్నామన్న
ఆ మమతకు వెనుకనున్న ఘనత నీది కాదె.
చిన్నలు, పెద్దలు, ఆస్తులు, అంతస్తులను
అరమరికలు లేని ఆత్మీయతను గల్గి
సామరస్యమున ఇచటి సభ్యులున్నారన్న
అది నీ అతులిత సామర్థ్యమున కాదె!
5. గౌరవప్రదమగు ఆచార్య పదవిని
జయప్రద మొనర్చుకొన్న ఓ గురువరా!
నీ శేష జీవితము శుభప్రదమగునట్లు
ఆయురారోగ్యాలతో నిన్ను ముంచెత్తుమని,
ఆనందాంబుధిలో ఓలలాడించుమని
రమణ భగవానుని మేము ప్రార్థింతుమయ్య.
6. కవిత్వము వ్రాయ నే కవయిత్రిని గాను,
గొంతెత్తి పాడ నే కోకిలమ్మనుగాను,
చిత్తరువు గీయ నే చిత్రకారిణిని గాను,
కాని, మౌనమూనియుండ మనసురాదు.
7. మదిలోన విరిసిన మధురోహకుసుమాలు
వేవేగఁద్రుంచి వేడుకమీద నొకచోట చేర్చి,
అభిమానానురాగబంధమున పెనవేసి,
అర్పించుచున్నాను ఈ గేయమాలికను
ఆదరముతో నీవు అందుకొనుము,
ఆశీస్సులను మాకు అందజేయుము.

# The Power of Silence

Dr.K. Subrahmanian (Talk 101)

We want freedom. There can always be a discussion on 'freedom from what?' Eventually, when we come to think of it, what we want is freedom from our own minds. What we want is peace of mind. Bhagavan has said that the state you are seeking is a state beyond freedom and bondage: *Bandhamuktiateetam paramsukham* (Upadesa Saaram). We cannot understand with our limited mind the state which is beyond our mind. Whatever we say of this state, it is still of the mind. And so, Bhagavan says, there is no way in which you can understand the state which is beyond the mind. However, you experience that state every day in deep sleep. We are not conscious of our body, of our mind, of anything. Yet, we are supremely happy because there is no ego of any kind, whatsoever; there is no individuality of any kind, whatsoever. Bhagavan says this is proof of existence beyond the mind. But if you want to understand that state, no amount of discussion is going to help you. He says, once you understand this, what you should do is,either you surrender totally to the Lord or find out who you are. This is the thing that is most important Bhagavan says; before you come to any conclusion about this intellectually, you must realize that there is a supreme power that is running the whole show.

If I think of Bhagavan, it is through his grace. This is a matter for experience; this is not a matter for explanation. I can use beautiful words to describe this, and still it is not experience. However beautifully I describe the taste of *laddu*, I cannot convey that taste through words. And so, Bhagavan says, you must experience this. Every day, when you get up



in the morning, you must meditate. Here also, we can talk about meditation for a hundred years, but we know that there is no one technique of meditation; each one meditates in his own way. When Bhagavan was asked if there was anything he could give as a universal teaching, he said there is no such thing as universal teaching, each one practices according to his own way. The moment he realizes its value eventually, it will lead to whatever he desires.

So, *Bandhamuktiateetam paramsukham:* this is the state beyond bondage, beyond liberation. If that is the case, what can we say about it? And these are the reasons why when we meet at the Kendram, the peace that we get is because of Bhagavan. When we all meet and think of Bhagavan, when we sit here for about an hour and a half, we get a peace not through what I say or through what somebody says, but through Bhagavan. He is here, there, everywhere. He has told us, "They say I am going, but where can I go? I am here." He did not say, "I **shall** be here", he said, "I **am** here".

Going on a pilgrimage, going to temples etc. are good, but Bhagavan says that the most important thing is satsang. Getting together, thinking of the Guru for as long as possible is more beneficial. That gives peace which cannot be compared with anything else. And so, Bhagavan has said, satsang is the most important thing. In this Kendram, all talks and discussions take place after a period of meditation, after sitting together in satsang.

We have the kind of discussions here that are based on individual experiences. When each one tells you something of his own experience, it is a valid experience as far as that person is concerned. I can argue against your argument, but

I cannot argue against your experience. It will be absurd to say your experience is invalid. I may say, that is not a valid experience, but it is absurd. It is your own experience. You have followed a particular path. In fact, if I am humble enough, I can learn from your experience. And so, what is important is your experience.

What should happen in a Kendram like this is this - people should meet, sit in silence for an hour or an hour and a half, and leave quietly. Because I believe what Bhagavan can do through our silence, no amount of speech can do. And we all have experienced this. Several of you have told me on several occasions, when we sit here for one and a half hours in silence on the third Sunday, then we experience an extraordinary peace. You may say you are deluding yourself, that you think you are getting peace. Even if that were to be so, I like this delusion better than other things. Whatever it is, it is an experience. Nobody can disprove an experience. Therefore, we have assembled here to still our minds, in a way each one is used to. So, my humble submission is that all discussions we can have at the end of the satsang, every day. Infact, that is what people do in small groups, they ask questions. So, ultimately, Bhagavan says, words come from silence and go back in silence. Therefore, the basis of speech is silence, and silence is uninterrupted speech. This silence is not just the silence of the tongue; it is the silence of the mind. Where there is silence of the mind, communication can take place without the medium of words. And so, the moment I say that it is impossible, I deny Bhagavan. I must have the faith that it is possible. And try and try and try, and through His grace we will reach a stage we will feel that words are not necessary. And this is the stage, we will reach through his grace.



## Dr.K.S. - Some Treasured Memories

Sri G. Sri Hari Rao

I had the great good fortune of taking down dictation from Dr.K.Subramanian (Dr.K.S.) about some auto biographical details that covered his childhood, his parents, his 'first meeting' with Sri Bhagavan, his interactions with Sri Bhagavan, his memories of great devotees of Sri Bhagavan like Viswanatha Swami and Sri Muruganar. They formed the first forty four pages of the homage paid by the Sri Ramana Kendram, Hyderabad devotees in the form of a small book- **Dr.K.Subrahmanian. A Tribute.** Dr. K.S. stipulated that it should not be published during his lifetime. *'The Tribute'* was our humble offering on the occasion of his first *Vardhanthi* on 11th January 1999.

In the course of his narration, Dr. K.S.mentioned a question posed by his father, ShriKrishnaswamy, to Sri Bhagavan. The question was: "We see many *sadhus* in this world, some genuine and some fake. How do we distinguish between both?" Sri Bhagavan replied, "Those sadhus in whose presence people experience spontaneous peace without making any special effort are genuine sadhus."

Dr.K.S. was one such sadhu, a sage in whose presence many felt comforted, reassured and joyous - like a child feels in the lap of its mother. I have been one among the many fortunate who benefitted from his proximity, his power of presence, and his sage counsel.

